**సమస్యలు చాకుల్లా గుచ్చుతుంటే ఆ బాధల గాయాలను మాన్పుకోడానికే కొందరికి జీవిత కాలం సరిపోతుంది. మధ్యతరగతి కుటుంబంలోని వ్యక్తులే దీనికుదాహరణ. ఆ కోవకు చెందిన వాడే విఠలరావు.**

మున్సిపల్ ఆఫీసులో ఎల్. డి. సి.గా చేరి కష్టపడి యు. డి. సి. ఎకౌంటెంటయి మరి ఎదగలేక అక్కడినుంచే రిటైరయ్యాడు.

# నిర్ణయం



కంచుమర్తి వెంకటేశ్వరరావు

ఉద్యోగం చేసినంతకాలం ఏం సంపాదించాడో తెలియదుగాని యిద్దరు అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేశాడు. కొడుకును బి.ఏ వరకు చదివించాడు.

ఉద్యోగంలోంచి రిటైరయ్యాడు గాని, బాధల నుంచి కాలేకపోయాడు విఠలరావు. ఆ సంవత్సరం కొడుకు శేఖర్ బి.ఇడి; కాలేజీలో చేరుతానని అప్లికేషను పెట్టాడు. సీటు సంపాదించాలి. మూడో అమ్మాయి సుధ ఇంటర్ చదివి పెళ్ళికెదిగి కూర్చుంది. అమ్మాయి పెళ్ళి చెయ్యాలి.

బి ఇడి. కాలేజీలో ఫస్టు లిస్టు పెట్టారు శేఖర్‌కు సీటురాలేదు. ప్రభుత్వం ఎవరికి ముందు ప్రాధాన్యత ఇస్తుందో వారికి సీట్లిచ్చారు. మిగిలిన సీట్ల గురించి కేండిడేట్లు తమ తమ బలాలు చూపించాలి. భోజనాల దగ్గర ఆ మాటే అన్నాడు శేఖర్.

"నాన్నగారూ.... ఈ సంవత్సరం సీట్లు పెంచారు. ఎవరి చేతనైనా రికమెండ్ చేయిస్తే సీటు రావొచ్చు."

ఆలోచనలు మొదలయ్యాయి విఠలావుకి సీటు సంపాదించాలంటే ఆ ఊ. ఎం ఎల్. ఏ గారినో, ఎం పి. గారినో పట్టుకోవాలి. తన లాంటి సామాన్యుడికి వారెవరూ అందుబాటులో వుండరు. మరి ఎవరిని పట్టుకోవాలి?

"ఏమండీ... ఆ మధుసూదనరావుగారే వున్నారు."


భార్య సీతమ్మ అలా అడగడంతో కొడుకు సమస్యలోంచి కొంతసేపు కూతురి సమస్యలోకొచ్చాడు. సుధను చూడ్డానికి నెల క్రితం పెళ్ళివారొచ్చారు. చూసి ఇంటికెళ్ళిన తరువాత కబురంపుతామని వెళ్ళారు. నాలుగు రోజులకి పదివేలిస్తే సమ్మతమని లెటరు వ్రాశారు. పదివేలంటే మాటలా .... ఆ మాటే భార్యకు చెప్తే మరి మాట్లాడలేదు. మార్కెట్టులో వస్తువుల ధరలెలా పెరుగుతున్నాయో, పెళ్ళికొడుకుల విలువ కూడా లాగేఅందుబాటులో లేకుండా పోతోంది. అంట్రోతు నుంచి ఆఫీసరు ర్యాంకువరకు ఒక్కొక్కరు ఒక్కొక్క ఖరీదు పెట్టి డిమాండు చేస్తున్నారు.

ఆలోచనలు విఠలరావుని వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఆ రోజు సాయంత్రం బజారులో విఠలరావుకి యెదురయ్యాడు అతని ఫ్రెండు రాజారావు.

"అలా బెంబేలుపడతావేమిటోయ్. ఒకసారి ప్రిన్సిపాల్‌ని పర్సనల్‌గా కలుచూద్దాం" అని సలహా విసిరేడు. విఠలరావు సరాసరి ప్రిన్సిపాల్‌గారింటి కెళ్ళాడు. అక్కడొక పెద్ద క్యూ. వీరంతా సీట్లు కోసమేనా ....ఓ ప్రక్కకు నిలబడ్డాడు ఖరీదైన మనుష్యులు గబగబ లోపలకు వెళ్ళి కాలరెగరేసుకుని బయటకొస్తున్నారు. చాలాసేపటికి తన వంతు రావడంతో లోపలకు వెళ్ళి ప్రిన్సిపాల్ గారికి తన కథను చెప్పాడు విఠల్‌రావు. ప్రిన్సిపాల్ అవీఇవీ అడిగి మరోసారి కలవండనడంతో బయటికి వచ్చాడు.



## వివరాలు

పూర్తి పేరు : కంచుమర్తి వెంకటేశ్వరరావు. జననం : 1960 జనవరిలో

విద్యాభ్యాసం : విజయనగరంలో 1980లో ఆంధ్ర యూనివర్శిటీ నుంచి B.Sc డిగ్రీ పొందాను

సాహితీ పరిచయం : నా 15వ ఏట నుంచీ కవితలు, కథలు వ్రాస్తున్నాను. నా రచనలు మా కాలేజీ మేగజైనుకే పరిమితమయ్యాయి. నా సాహితీ గురువు 'రామతూరి'

మధ్యతరగతికి చెందిన వ్యక్తుల బాధల్లోనే మంచి కథలకు ప్లాట్లు దొరుకుతాయి నేనూ మధ్యతరగతికి చెందినవాడినే కాబట్టి, ఆ పరిధిలోనే మంచి కథలు ముమ్ముందు వ్రాయాలని నా ఆశయం.

—కంచుమర్తి వెంకటేశ్వరరావు

---

ఉదయం, సాయంత్రం అలా తిరుగుతూనే వున్నాడు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలలు గడిచాయి. (మా సమీపంలోని బి. యిడి కాలేజీలో ఎడ్మిషన్లు ఆగస్టు నుంచి మళ్ళీ జనవరి వరకు అవుతూనే వుంటాయి. పెద్ద పెద్ద మనుష్యులొస్తుంటే సీట్ల సంఖ్య కూడా పెరుగుతుంది.)

విఠలరావు కేం తోచడం లేదు.

ఎంత ప్రయత్నించినా ఆలోచనలు ఓ కొలిక్కి రావడం లేదు.

శేఖర్, సుధలు అతని ఆరో ప్రాణం.

అది కావాలి, ఇది కావాలని ఏరోజూ సాధించరు. అందుకే వారంటే విఠలరావు కెంతో అభిమానం. వారికేం చెయ్యలేక పోతున్నాననే బాధ నరనరాల్లో ఇంజక్ట య్యింది.

రాత్రి, పగలు ఇవే ఆలోచనలు.

పట్టు వదలకుండా కాలేజీ చుట్టూ, ప్రిన్సిపాల్ గారింటి చుట్టూ తిరుగుతూనే వున్నాడు. అమ్మాయి పెళ్ళి గురించి ఎవరేదైనా చెప్పితే అక్కడికి పరుగెడుతూనే వున్నాడు. అక్కడి రేటు విని మరో ప్రక్కకు.... ఇలా అటు ఇటు తిరిగినా ఫలితం శూన్యం.

ఎక్కడ లోపం ఉందో విఠలరావుకు తెలుసు.

అయినా ఏం చెయ్యగలడు?

ఆ రోజు విఠలరావు వరండాలో వాలు కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

చెరో ప్రక్కకు చేరారు శేఖర్, సుధ.




అలా వచ్చారంటే ఏదో అడుగుతారని అనుకుని వారివైపు చూశాడు విఠలరావు.

"నాన్నగారూ.... నేనొక నిర్ణయాని కొచ్చాను. మీరు నన్నర్థం చేసుకుంటారనే నమ్మకం నాకుంది."

"............"

"నాన్నగారూ ఉద్యోగంలోంచి రిటైరయినా విశ్రాంతి లేకుండా మీరలా తిరుగుతుంటే నాకెంతో బాధగా వుంది. మీరీ రోజు నుంచి ఎక్కడికీ తిరగవద్దు. నేను మరి చదవదలచుకోలేదు. నా ఫ్రెండొకాయనకు మోటార్ మెకానిక్ షాపుంది. సంవత్సరంపాటు పని నేర్చుకొంటే తరువాత ఇండివిడ్యూల్‌గా షాపు పెట్టొచ్చునని సలహా యిచ్చాడు. నేను రేపటినుంచి ఆ పనిలో చేరుతాను. బి. ఎ. చదివి యిదేం పనని అనకండి. ఈ రోజుల్లో చదివిన చదువుకు, వచ్చే ఉద్యోగానికి పొంతన వుండడంలేదు. అటువంటప్పుడు యెప్పుడో ఉద్యోగాలొస్తాయని యెదురుచూస్తూ టైంను వృధా చెయ్యడం మంచిదికాదు. మీరు మనస్ఫూర్తిగా నన్నాశీర్వదించండి. చెల్లాయి పెళ్ళి గురించి మీరు బాధపడొద్దు. పెళ్ళి నేను చేస్తాను."

శేఖర్ మాటలు కొత్తగా వున్నాయి ఆ రోజు విఠలరావుకి.

"నాన్నగారూ.... నేనూ ఒక నిర్ణయాని కొచ్చాను."

సుధ అలా అనడంతో విఠలరావు కూతుర్ని, కొడుకుని మార్చి మార్చి చూశాడు.

"నాన్నగారూ .... ఇద్దరక్కయ్యల పెళ్ళిళ్ళకు ఎన్నో అప్పులు చేశారు. ఎలాగో అవి తీరిపోయాయి. మళ్ళీ నా పెళ్ళి గురించి అప్పుచేస్తే ఈ స్థితిలో ఎలా తీరుస్తారు? అందుకని ఇప్పట్లో నా పెళ్ళి విషయం ఆలోచించవద్దు. నేను ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నాను. టైపు లోయర్, హయ్యరు పాసయ్యానుకదా.... నా స్నేహితురాలు నీరజ ఫాదర్ జిల్లా పరిషత్ ఆఫీసు సెక్రటరీ. మొన్నొకరోజు ఆయన్ని కలుసుకుని ఏదైనా జాబ్ గురించి అడిగాను. నా క్వాలిఫికేషన్లు అడిగి టైపిస్టు పోస్టుకు ఎప్లయి చేయమన్నారు. నెలాఖరికి టెస్ట్ పెడతారట. ఇంటర్వ్యూలో తప్పకుండా సెలక్టయేటట్లు చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. నాకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది.

నాన్నగారూ.... మీరు కోప్పడతారేమోనని ఇంత వరకు చెప్పలేదు. కానీ మీరు మా గురించి విశ్రాంతి లేకుండా తిరగడం చూసి అన్నయ్య, నేను మరి ఆగలేకపోయాం. అందుకనే ఈ నిర్ణయాలకొచ్చాం. అన్నయ్యను, నన్ను ఆశీర్వదించండి."


తండ్రి మొహంలోకి చూసింది.

శేఖర్, సుధ మాటలకు విఠలరావు కన్నీటిని ఆపుకోలేకపోయాడు.

శేఖర్, సుధల ధోరణి అంతా విచిత్రంగా వుంది విఠలరావుకి. అప్పుడే వారెంత ఎత్తుకు ఎదిగిపోయారు. వారి భవిష్యత్తు గురించి ఎంత చక్కటి నిర్ణయాలు తీసుకున్నారు.

విఠలరావు హృదయం తృప్తితో నిండిపోయింది. కన్నీటితోనే "బాబూ, అమ్మా సుధా మిమ్మల్ని చూసి గర్వపడుతున్నాను. మీ నిర్ణయాలు మీ జీవితాల్ని బంగారుబాటలో నడిపించాలని మనసారా కోరుకుంటున్నాను" అన్నాడు.

ఆ సమయంలో అక్కడికి వచ్చిన సీతమ్మ ఆ ముగ్గురినీ చూసి ఆనందంతో రెండు కన్నీటిచుక్కలు రాల్చకుండా వుండలేకపోయింది. ○



"భోగిమంట"

చిత్రం : ఆర్. విశ్వనాథ్, విల్లివాకం

వివాహాది శుభ కార్యములకు-
విందు భోజనములకు,
ప్రతి నిత్యము మీ ఇంటి వాడుకకు.
నమ్మకమైన
పాత బియ్యం
పరిశుభ్రముగా బాగు చేయబడినవి.
శ్రీవిజయ రైస్ కంపెనీ
గవర్నరుపేట : విజయవాడ-2
ఫోన్ చేసిన వెంటనే హోమ్‌డెలివరి చేయబడును
ఫోన్: 73704
SUVARNA

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు
★ స్కూలుయూనిఫారంలు _ వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు
గవర్నరుపేట ............ విజయవాడ-2.